# గాలిపటం

ఆరుద్ర జూనియర్



నాలుగు పెద్దరోడ్ల కూడలి ఆ ప్రదేశం. విశాలమైన రోడ్లవి. నాలుగురోడ్ల మొగలలోను నాలుగు కిళ్ళీ బడ్డీలున్నాయి. రోడ్ల కిరుప్రక్కలా విశాలమైన బీడు భూములు "మా బ్రతుకులింతేనా" అని ఆవులిస్తున్నాయి. సూర్యుడు తన రౌద్రాకారాన్ని తారురోడ్లో చూసుకొంటున్నాడు. మఱ్ఱిచెట్టు భారంగా తలూపింది, రెండుపిచ్చికలు ఎగిరాయి. దూరాన పావురాల గుంపు ఎగురుతూంది. దూడఒకటి 'అంబా' అని అరిచింది. దూరాన ఎడ్లబండ్లు పోటీపడుతూ, మెడలో మువ్వలు మొరుస్తుంటే పరుగెడుతున్నాయి.

"బాబూ" దీనంగా వినిపించిందొక కంఠం. కంఠస్వరాన్ని బట్టి అదొక స్త్రీ దనుకుంటూ తలెత్తబోయాను. నా ఊతకఱ్ఱ కొంచెం కదిలింది. జారి పడబోయి ప్రక్కనున్న చెట్టును పట్టుకున్నాను. తలెత్తాను. బీదరికం పెడ్తున్న బాధతో, కృంగి, కృశించిన ఒకయువతి నా కళ్ళముందు కనిపించింది. సుమారు పదహారేళ్లుంటుంది. చిరిగిన పరికిణీ వేసుకుంది, జుత్తు తైలసంస్కారం లేనట్లుంది. శరీరం బాగా ఎండినట్లుంది.

ఎదురుగుండా కూర్చున్న అయనతలెత్తకుండానే "పో, పోమ్మాయ్" "మీకిదోవేషం," ఎవర్నంటే వాళ్ళ నడగడం. మానం మర్యాదలేదు. సంపాదించాలంటే మీలాంటి వాళ్ళు ఎలాగైనా సంపాదించవచ్చు." అఖరి మాట అతనంటూంటే నా నరాలు కంపించాయి. ఏమాత్రం ఒంట్లో శక్తున్నా అతని అంతు తేల్చేవాడినే' కాని నేను నిస్సహాయుణ్ని. ఆ భగవంతుడు నన్నొకకుంటిభిక్షగాడ్నిగా చేశాడు.

అతను అన్నమాటలను వినిపించుకోకుండామరో ఆసామీ దగ్గరకెళ్ళింది. ఆయన అంతక్రితం ఆయనలా కాకుండా "లేదు పోమ్మా!" అన్నారు. కొందరు ఆమెను చూసి నిద్రోతున్నట్లు నటిస్తున్నారు, ఒకామె జాలితో ఒక నయాపైసావేసి "పాపం! వయసు ఆడకూతురు "లేదు" అని అడిగితే గుండె తరుక్కుపోతుందే "జానకి అంటూ ప్రక్కావిడతో నవ్వుతూ చెప్తూంది.

అరగంట యాచనఫలితం పన్నెండు పైసలు. టీ కొట్లో టీతాగింది. మళ్ళీ బస్సుస్టాండుకొచ్చింది. చెట్టుక్రింద కూర్చుంది. మెల్లగా కునుకుపట్టింది.

ఆమెను నేను చూడ్డంఅదే మొదటిసారి. ఆ ప్రాంతాలకునేనువచ్చి ఏడాదయింది, అందరి ఆదరణకు పాత్రుడ్నికనుక ప్రతివాళ్లు చిల్లరివేయడం నా రోజు గడిచిపోవటం జరిగేది. మిలిటరీలో యుద్ధంలో నాకోకాలుపోవటం, నన్ను తీసివేయటం జరిగింది, నా భావిజీవితం గాఢాంధకారమయమైంది. ఎభై ఏళ్ళ భికారికి ఎవరూ ఉద్యోగం యివ్వలేదు. మిత్రులూ, తోడబుట్టినవాళ్లు ఎవ్వరూలేరు. ఉద్యోగ ప్రయత్నాలువిఫలంకాగా ఉదరపోషణకై యాచకుడిగాను.

బస్సొచ్చింది. అదిపేరుబడ్డ గ్రామంగనుకచాలామంది దిగారు. ప్రయాణీకులు ఆదరాబాదరాగా మూటలు, ముల్లెలు సర్దుకొనిబస్సెక్కారు. గమ్యం వైపు బస్సుకదలింది. దిగినవాళ్ళలోగ్రామకరణం, కరణం పదేళ్ళకొడుకుకూడా వున్నారు. ఆయన ఎవరో తెలియని ఆ యువతి అతన్ని అడిగింది. "రాను రాను మన గ్రామంలో ఈ బాధకూడాపెరుగుతోందే"అంటూ పదిపైసల నాణెంఆమె వైపు విసిరాడు. అతని చివాట్లువినిపించుకోకుండా నాణాన్ని తీసుకొని వినయం నిండిన వదనంతో మరో మొహాన్ని వెతికింది.

కాస్సేపటికి బస్సుపోయిన వాతావరణంప్రశాంతమైంది. ఆమెకు రూపాయి చిల్లర నాకు పావలా చిల్లరా వచ్చింది. నాకు పోటీదారు ఏర్పడ్డమూలంగా నా రాబడి తగ్గింది, అయినా బాధపడలేదు.

నా ఊతకర్ర సహాయంతో కుంటుతూ ఆమెను సమీపించాను. ఆమె కలల వీధిలో సంచరిస్తూంది. ఒక్కక్షణం ఆమె అనుభవించిన లేతమొహాన్ని చూశాను. ఆమె మొహాన్ని చూస్తూంటే ఎడతెగని జ్ఞాపకాలురావడంతో నిస్సహాయుడిగా వెనుదిరిగాను. నా నిట్టూర్పులు గాలిలో కలిసిపోయాయి.

జరిగినజీవితం మిగిల్చిన అనుభవాలతో జరగబోయే జీవితాన్ని శోభాయమానంగా చేసుకోవాలంటూందామె అనుకున్నాను.

## 2

అప్పుడే సూర్యుడు తూర్పు కొండల చాటునుంచి తొంగి చూస్తున్నాడు. ఆకాశం రక్తసిక్తమైఉంది. పక్షులు చెట్లమీది నుంచి రకరకాల

శబ్దాలు చేస్తున్నాయి. కాలకృత్యాలు ముగించు కొన్న నేను ఆమెను వెతికాను. కాని ఆమె కన్పించలేదు. పరిసర ప్రాంతాలవైపు చూపులు సారించాను. ఫలితం శూన్యం. "ఉదయంనుంచి ఏంచేస్తూందో" అన్నభావం నాలో మెదిలింది. మధ్యాహ్నం పన్నెండు గంటలప్పుడు వచ్చింది. ఆమె చేతిలో ఒక పెద్ద అట్టపెట్టె పాతబుట్ట. విరిగిపోయిన దొక బుట్ట కనిపించాయి. చెట్టుకింద కూర్చుంది. బుట్టలోని బద్ద నొక్కొక్క దాన్నే తీసి, సమానంగా విరిచి భాగాలు చేసింది. అట్ట పెట్టెలో దాచిన రంగు కాగితాన్ని తీసి త్రుప్పు పట్టిన పాత బ్లేడుతో చతురంగా కత్తిరించింది. కొబ్బరి మూతలోదాచిన అన్నం మెతుకులతో ఒక చిన్న అందమైన గాలిపటం చేసింది.

ఆ మొదటి గాలిపటాన్ని ఆమె చూస్తున్నప్పుడు ఆ మొహంలో ఏదో అవ్యక్తానుభూతి నిండివుంది. ఆశ్చర్యంగా చూస్తున్నాను. ఆమెదగ్గర మూడు రంగు కాగితాలున్నాయి. రకానికి నాలుగు వంతున ఒకడజను గాలిపటాలు చేసింది. వాటిని చేయగా మిగిలిన కాగితపు ముక్కలతో గాలిపటాలకు తక్కనీ, తోకలనీ పెట్టింది. మట్టికొమ్మ ఒకటి అమధ్య గాలివానకు వంగిపోతే దానికి గాలిపటాలను తగిలించింది.

ఆమె దగ్గిరికి వెళ్ళాను. నవ్వుతూ పిల్చింది. ఆ నవ్వుల్లో ఎంతో అనురాగం, ఆనందం, ఆ పిలుపులో ఎంత అభిమానం నిండుందో నాకు తెలుసు. ఆమెను సమీపించగానే.

"ఏం తాతా గాలిపటం కావాలా?" అంది.

"నాకెందుకమ్మా గాలిపటం. నా బ్రతుకే ఒక తెగిన గాలిపటం" అన్నాను. అంటూంటే నాకళ్ళు చెమ్మగిల్లాయి. అశ్రుధారలు చెక్కిలి మీదుగా జారుతూంటే 'ఎందుకు తాతా ఏడుస్తున్నావు" అంది ఆయువతి. "ఏంలేదమ్మా అంటూ చెక్కిలిమీది అశ్రు బిందువులను తుడుచుకొన్నాను.

ఇంతలో బస్సొచ్చింది. కరణంగారు, ఆయన పదేళ్ళ కొడుకూ దిగారు. కరణంగారి కొడుకు గాలిపటాలను చూసి "నాన్నా గాలిపటం" అని సనిగాడు.

"అమ్మాయ్! గాలిపటం ఎంత?" కొంచెం హుందాతనం నిండిన గొంతుతో అడిగాడాయన.

"ఐదు పైసలండీ" అందామె.

పదిపైసల నాణెం ఆమె వైపు విసరివేసి ఒక గాలిపటం కొడుక్కిచ్చి మిగతా ఐదు పైసలు నాకేసి విసిరాడు. నిజంగా నేను యాచకుణ్ణే అయినా ఆమె ముందు నీరు కారిపోయాను. నా జీవితం వృథా అనిపించింది. అక్కడ నేనున్న పావుగంటలో కరణం గారబ్బాయి గాలిపటం ఊళ్ళో కెళ్ళడంతో గ్రామంలోని పిల్లలందరూ గాలి పటాలకోసం రావడం, కొనడం, మిగిలిన చిల్లర పైసలను నాకు వేయడం జరిగింది. నా మనస్సులో నేను ఆమె కన్నా అన్నివిధాలా చిన్నవాణ్నయి పోయాను.

"తాతా టీ తాగుతావా"? ఆమె అడిగింది.

ఈ మాటలతో నాలో విద్యుత్తు ప్రవహించింది.

"వద్దమ్మా! ఇందాకే తాగేను" అన్నాను మోడు వారిన చెట్టువైపు దీర్ఘంగా చూస్తూ.

డబ్బు లెక్క పెట్టుకుంది. "రెండు రూపాయ లుంది తాతా". మొదటి రోజు వ్యాపారంలో అరవై పైసలు దొరికింది. రంగు కాగితాల ఖర్చు పోతే నాకు నలభై పైసలు లాభం వచ్చింది తాతా" అని ఆమె చెప్తూంటే ఆమెకళ్ళలో కాంతిపుంజాలు మెరిశాయి. గాలి పటాలన్నీ అయిపోయాయి అట్ట పెట్టె అడుపెట్టుకొని నిద్రపోయింది. నిన్న సాయంత్రం ఆమెను తిట్టిన ఆసామీ ఆమె అట్ట పెట్టె, అందులోని వస్తువుల వైపు ఎగాదిగా చూసి అర్థంకాక వెళ్ళిపోయాడు.

రాత్రి బస్సుస్టాండు దగ్గరకూర్చుంది. తను యాచించకపోయినా క్రితంరోజు యాచించింది కనుక కొంతమంది చిల్లర డబ్బు వేశారు. ఆమె వద్దన లేదు.

పరధ్యానంగా అడిగాను.

"ఎంత ఉందని."

మొత్తం మూడు రూపాయ లుందంది.

బస్సు వెళ్ళిపోగానే టీ కొట్లో రెండు బన్నులు కొని నా కొకటిచ్చి తానొకటి తింది. వద్దన్నాను మొదట.

కానీ బ్రతిమాలింది.

తిన్నాను.

అంత క్రితంరోజులాగే మూడో రోజుకూడా ఆమె పన్నెండు గంటలదాకా కన్పించలేదు. కానీ పన్నెండింటికి మాత్రం ఆమె కొన్ని రంగు కాగితాలతో, మరొక చిన్న పెట్టెతో నాకు కన్పించింది. ఒంటిగంట ప్రాంతానికి ఆమె దగ్గిరికి వెళ్ళాను.

ఆమె గాలిపటాలు చెయ్యడం పూర్తి చేసింది. పెట్టెలోంచి కొబ్బరి ఆకులు తీసింది. వాటితో కొబ్బరి 'బూరా'లు చేసింది. రంగురంగుల తాటి ఆకులతో 'రిస్టు' వాచీలను, బొమ్మలను తయారు చేసింది. చిన్న కవరులో బెలూన్లున్నాయి. మళ్ళా నాలుగింటికి చూశాను.

మట్టికొమ్మదగ్గర బెలూన్లు వేలాడుతున్నాయి. వాటి ప్రక్కనే గాలిపటాలు అట్టపెట్టెలో అవతలి వారికి కనబడేలా బూరాలూ, బొమ్మలూ ఉంచింది. ఒకటి తనే ఊదింది. ఇంతలో బస్సొచ్చింది.

ఈవేళ కరణంగారు ఆశ్చర్యపోయారు. ఆమె వంక చూస్తున్నపుడు అతని మొహంలో ఏదో ఆనందం మెరిసింది. అబ్బాయికి, రకానికి ఒకటి కొనిచ్చి, ఆమెవైపు సంతోషంగా చూస్తూ, నావైపు నీరసం నిండిన చూపులు విసిరేసి వెళ్ళిపోయారాయన. ముందటిరోజు లాగానే కాసేపట్లో చాలా మంది పిల్లలొచ్చారు. రెండుమూడు వస్తువులు తప్ప అన్నీ అమ్ముడు పోయాయి. ఆ రోజు రూపాయి న్నర లాభం వచ్చింది. రాత్రి యాచనకు రాలేదు.

రాత్రి కొట్టు దగ్గరకు బస్సు రాగానే యాచనకు బయలుదేరాను. అర్ధ రూపాయి వచ్చింది. తీసికొని టీకొట్టు వైపుకి కదిలాను టీ తాగి బన్ను తిన్నాను. నిద్ర రాకపోతే ఆమె దగ్గిరికి వెళ్ళాను.

ఆమె బన్ను తింటూ నా గురించి అడుగుతూ "నీ కెవరూ లేరా తాతా" అంది.

"ఎందుకు లేరమ్మా! నువ్వున్నావుగా!"

"అవును నేనున్నానుగా" అంది తలవంచుకుంటూ.

"అవునుగానీ నీ కెవరూ నాన్నా, అమ్మా లేరామ్మా?" అడిగాను. ఇంత పెద్దవాణ్ణి నేను ఆ లేతహృదయాన్ని పుండు చేశానేమోనని భయపడ్డాను.

ఆమె కళ్ళలో నీరు తిరిగింది. ఏడవబోతూ అంది.

"మా నాన్న మిలిట్రీలో పనిచేసేవారట. మా అమ్మ నన్ను కడుపుతో ఉండగానే నాన్నదగ్గర్నుంచీ ఉత్తరాలు రావడం ఆగిపోయాయట. కొంతమంది నాన్న పోయారని, మరి కొంతమంది గాయపడ్డారని చెప్పారట. అమ్మ బ్రతుక్కుతోడూ ఆమె గర్భంలో నన్నుకూడా ఆమెకు భారం చేశాడు భగవంతుడు. యాచనకు దిగిందిఅమ్మ. ఒకరోజు నెలలు నిండిన నాడు ఒక అనాథ ఆశ్రమం దగ్గిర నన్ను కని అమ్మ...పోయిందట...' ఆమె వెక్కుతూంది.

"ఏడవకమ్మా" అంటూ ప్రేమతో తల నిమురుతూ అన్నాను. నా కంట్లోంచి రెండు నీటిబొట్లు ఆమె ఎర్రని కపోలాలపై రాలాయి.

"నాకు ఊహొచ్చిందని, నా జీవితాన్ని నన్నే చక్కపెట్టుకొమ్మని నన్ను బాహ్య ప్రపంచంలోకి పంపించారు. ఎన్నెన్నో ప్రయత్నాలు చేశాను సక్రమంగా జీవితం గడపాలని. కానీ లోకమంతా కాలకూట విషంతో నిండుంది. మరో గతి లేక యాచనకు దిగాను.


"అమ్మ పోతూ మిగిల్చిన ఈ ఆస్తిని మాత్రం వాళ్లు నాకిచ్చారు." అంటూ బొడ్లోంచి పాత కవరును నా కందించింది. ఆ కవరు తెరిచి చూశాను. నా కళ్లు బైర్లు కమ్మాయి. అది మా పెళ్ళి ఫొటో.

"శాంతీ...శాంతీ..." అని అరిచాను. నా మొహంలో వచ్చిన మార్పు, నా వేగం నిండిన మొహం ఆమెను ఆశ్చర్యపరచిందేమో

"ఏం తాతా"...అందామె

"నేను నీకు తాతను కానమ్మా..." అన్నాను.

★



రైల్వే స్టేషన్ వద్ద
రామాలయంవీధి